## మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేదురుమల్లి



**కోట, జులై 16 ప్రభాతవార్త** వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, నెల్లూరు జిల్లాలల్లో వైసీపీ కార్యకర్తలను కూటమి నాయకులు పోలీసులతో వేధిస్తున్నారని , రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని వారి మధ్య రాజకీయ చర్చి జరిగినట్లు తెలిసింది.



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జులై 16, ప్రభాతవార్త:** సోమశిల జలాశయంలో గురువారం నాటికి 92.248మీటర్లు (302.651 అడుగులు) మట్టంతో జలాశయంలో 32.428 టిఎంసిల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి జలాశయానికి నీరు ఏమీ రాకపోగా పెన్నా డెల్టాకు 2200క్యూసెక్కులు, కావలి కాలువకు 950క్యూసెక్కులు, ఎస్ఎఫ్‌సికి 50క్యూసెక్కులు, ఎస్‌కెఎఫ్ఎఫ్‌సి కు 50క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారని సగటున 250క్యూసెక్కుల వంతున నీరు ఆవిరవుతోందని అధికారులు తెలిపారు.

# పల్లె వీక్షణ అర్జీలకు 30 రోజుల్లో పరిష్కారం

- ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం
- జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల
- పులికల్లులో కలెక్టర్ హిమాన్ను శుక్ల, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యటన
- గ్రామస్తుల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపిన కలెక్టర్, ఎమ్మెల్యే



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలో వినూత్నంగా నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" కార్యక్రమంలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల తెలిపారు.

❖ గురువారం పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, పులికల్లు గ్రామ సమీపంలో చేపడుతున్న వీబీజీ–రాంజీ ఉపాధి హామీ పనులను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతను పరిశీలించి, గ్రామంలో మినీ గోకులాన్ని ప్రారంభించారు.

**గ్రామస్తులతో ముఖాముఖి... అర్జీల స్వీకరణ..** అనంతరం జిల్లాస్థాయి అధికారులతో కలిసి గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని వెంటనే పరిష్క రించేలా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించా రు. గ్రామస్తులు వివరించిన సమస్యలను క్షుణ్ణంగా ఆలకించి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.

**గ్రామ సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం..** పర్యటన సందర్భంగా గ్రామస్తులు ప్రస్తావించిన అనేక సమస్యలకు కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే పరిష్కారం చూపించారు. గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేయాలని కోరగా వెంటనే ఆమోదించారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సమయాన్ని అరగంట ముందుకు మార్చాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పశువుల సంరక్షణ కోసం మినీ గోకులాలు మంజూరు చేయాలని పాడి రైతులు కోరగా వెంటనే 10 గోకులాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామానికి ప్రతి వారం 104 వైద్య సేవలు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ❖ తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రతి సమస్య పరిష్కారమే పల్లె వీక్షణ లక్ష్యం..** ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నూటికి నూరు శాతం సమర్థవంతంగా అమలవుతున్నాయా? అర్హులందరి కీ అందుతున్నాయా? అనే విషయాలను ప్రత్య క్షంగా పరిశీలించడమే "పల్లె వీక్షణ" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజల సంతృప్తి స్థాయిని తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దేందుకే చేపట్టినట్లు తెలిపారు.

❖ పల్లె వీక్షణలో అందిన ప్రతి అర్జీని ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, నెల రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పులికల్లు గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు సంతృప్తికరంగా ఉందన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు, వీబీజీ–రాంజీ పనుల పురోగతి ప్రశంసనీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పనితీరు కూడా ఎంతో బాగుందని, చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విద్యా కిట్లు అందిస్తోందన్నారు. జిల్లాలో 700 పైగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఉండగా ఆరు నెలల క్రితం వరకు కూడా కేవలం 100 కంటే తక్కువ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మాత్రమే పనిచేస్తుండగా, ప్రస్తుతం 240కు పైగా కేంద్రాలు వినియోగంలోకి రావడం అభినందనీయమని పేర్కొంటూ జిల్లా పంచాయతీ అధికారి వసుమతిని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోని సమస్యలు కార్యాలయాలకు చేరుకోవడంలో కొంత జాప్యం జరుగుతుందని, కానీ క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలిసి వెంటనే పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని చెప్పారు. పులికల్లు గ్రామంలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పల్లె వీక్షణ నిర్వహించినప్పుడు పరిధిలోని అన్ని గ్రామాల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

**- ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ అభినందనీయం..** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో ప్రారంభించిన పల్లె వీక్షణ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుండటం అభినందనీయమన్నారు.

❖ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే కారణంగా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో సమస్యలు తలెత్తాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కండులేరు జలాశయం మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో పాటు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు కూడా నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే సర్వేపల్లి జోసఫ్‌పేట, అంకుపల్లి మెయిన్ స్కూల్‌ల మార్పిడి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్నతి పథకం ద్వారా లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆర్డీఓ అనూష, డీపీఓ వసుమతి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఎస్ఈ లు కోటేశ్వరరావు, రాఘవేంద్రన్, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్, జడ్పీ డిప్యూటీ సీఈవో బ్రహ్మయ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపు



**వింజమూరు (వరికుంటపాడు), జూలై 16, ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం వరికుంటపాడు మండలం కాకొల్లువారిపల్లెలో రూ. 1.67 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గ్రామీణాభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే అభివృద్ధి అంటే కేవలం రోడ్ల నిర్మించడం మాత్రమే కాదని, విద్య, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. దుత్తలూరు ప్రాంతంలో డిఫెన్స్ అమ్మునిషన్ క్లస్టర్‌లో భాగంగా సుమారు రూ. 2,245 కోట్ల పెట్టుబడులతో ఐదు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందన్నారు. ఏడాదిలోపే పరిశ్రమల నిర్మాణ పనులు ప్రారంభమై స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి న అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఎలాంటి విభేదాలు ఉన్నా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన. ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఢిల్లీ పర్యటనల్లో సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర మంత్రులతో గంటల తరబడి సమావేశాలు నిర్వహిస్తూ నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని ఎంపీ కొనియాడారు. ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం రామకృష్ణకి కాకొల్లువారిపల్లెలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా జీవితంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తెలుగు దేశం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి దర్శనం...** దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానాన్ని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఎంపీకి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదా లను అందజేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపాళెంకు రూ.కోటి అభివృద్ధి రూ.71 లక్షలతో బీటీ, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

- మిగిలిన రోడ్లూ త్వరలోనే పూర్తి చేస్తాం కిసాన్ సెజ్‌కు మళ్లీ ఊపిరి.. యువతకు ఉపాధి అవకాశాలపై ఆశలు
- స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలని
- కూటమి శ్రేణులకు పిలుపు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కొడవలూరు, జులై 16 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం కొడవలూరు మండలం నాయుడుపాళెం పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మించిన 1.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు, రూ.21 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నాయుడుపాళెం పంచాయతీలో రూ.కోటికి పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసినా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని చెప్పారు. గతంలో కోవూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోయా యని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన అమలులో, రహదారుల నాణ్యత ప్రమాణాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. నాయుడుపాళెంలో మిగిలిన 1.10 కిలోమీటర్ల రోడ్డును రూ.40 లక్షల అంచనా వ్యయంతో త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొడవలూరు కిసాన్ సెజ్‌కు మళ్లీ కదలిక వచ్చిందని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో రూ.770 కోట్ల అభివృద్ధి పనులకు ప్రభుత్వం సహకరించిందని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం, సకాలంలో యూరియా పంపిణీ, ధాన్యం కొనుగోలు చేసి వెంటనే చెల్లింపులు చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలో వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు దాదాపు రూ.10 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ గడువు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు ఐక్యంగా పనిచేసి అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, మాగుంట సతీష్ కుమార్ రెడ్డి, కరకట మల్లికార్జున్ , కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, భూలోకం విజయకుమార్ , జొన్న శివకుమార్ , పల్లం రెడ్డి సురేష్ రెడ్డి, కోవూరు వెంకీ, మయూరి సిద్ధార్థ, బద్దిపూడి సూర్య, పలు శాఖ అధికారులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు



- ఉద్దేశపూర్వకంగా మంచినీటి పైప్‌లైన్ ధ్వంసం
- పట్టణ తాగునీటి సమస్యకు 20కోట్లతో శాశ్వత పరిష్కారం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఆత్మకూరు, జులై16, ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణ అభివృద్ధిని ఎట్టి పరిస్థితుల్లోను నిలువరించలేరని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలోమంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణానికి సోమశిల నుంచి తాగునీటిని అందించే ప్రధాన పైప్‌లైన్‌ను కొందరు దురుద్దేశపూర్వకంగా బోర్‌వెల్ యంత్రంతో ధ్వంసం చేశారని మంత్రి తెలిపారు. ఈ ఘటనతో పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. సమాచా రం అందిన వెంటనే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రస్తుతం 26ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. పైప్‌లైన్ ధ్వంసానికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారని, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు అత్యవసర చర్యలు చేపట్టామని వెల్లడించారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసం 89లక్షలు వెచ్చించామని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఆత్మకూరు పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు 20 కోట్లతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మకూరు మున్సిపాల్టీలో 75నుంచి100కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆత్మకూరు అభివృద్ధిని అడ్డుకోలేరని అన్ని రంగాల్లో ఆత్మకూరు ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఆత్మకూరు మున్సిపల్ అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అండ



రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి 'ఆనం'

**ఆత్మకూరు, జులై 16, ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నా రు. గురువారం ఆత్మకూరు పట్టణంలో 8.13లక్షల విలువైన 16సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధరకాల వ్యాధులకు వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా ఆర్థికసాయం అందించి అండగా నిలుస్తున్నార న్నారు. పేదలకు ప్రతి విషయం లోను మంచి చేయాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆర్‌డిఓ బి.పావని, తెలుగుదేశం సీనియర్ నాయకుడు తాళ్ళూరి గిరినాయుడు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర తెలుగుమహిళా నాయకురాలు పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర కార్పోరేషన్ ల డైరెక్టర్లు కంచర్ల మాధవి, అబ్బూరి రమేష్‌నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, తహసిల్దార్ పి.పద్మజాకుమారి, పలువురు టిడిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏడుకొండలది ముమ్మాటికీ సర్కార్ హత్యే కాకాణి

- దేశంలో మరే రాష్ట్రంలోని లేని విధంగా ఏపీలో అరాచక పాలన
- చంద్రబాబు నేతృత్వంలో అకృత్యాలకు అడ్డాగా మారుతున్న ఏపీ
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజం



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – వైద్యం** మనుబోలు నిందితుడు ఏడుకొండలది ముమ్మాటికీ లాకప్ డెత్తే అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం ఏఎ శ్రీహరి కేసులో సీఐ రూ. 40 లక్షల లంచం తీసుకుని పోలీసుల వల్లే ఒక కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. రాష్ట్రంలో నడుస్తోంది రాజ్యాంగ పాలన కాదని, చంద్రబాబు రెడ్ బుక్ అరాచక పాలన పై కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అరాచకాలకు, పోలీసుల లాకప్ హత్యలకు మారుపేరుగా మారిందని వైయస్సార్సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నెల్లూరు జిల్లాలో జరిగిన మనుబోలు లాకప్ డెత్, బుచ్చిరెడ్డిపాలెం ఏఎ శ్రీహరి హత్య ఉదంతాలే ఇందుకు సజీవ సాక్ష్యాలని, పోలీసుల వైఫల్యాలు మరియు అధికార పార్టీ నేతల ప్రమేయంపై తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, బాధిత కుటుంబాలను ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నెల్లూరు జిల్లాలో ఎన్నడూ లేని విధంగా మనుబోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన నిందితుడు ఏడుకొండల మృతి ముమ్మాటికీ లాకప్ డెత్ అని, జిల్లా ఎస్పీ వాస్తవాలను వక్రీకరిస్తూ నిందితుడు స్టేషన్‌లోనే లేరని, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడం అబద్ధం అని అన్నారు. శని, ఆదివారాలు (11, 12 తేదీల్లో) ఏడుకొండలు, రియాజ్, ప్రసాద్‌లను పోలీసులు విపరీతంగా కొట్టారు. ఆదివారం సాయంత్రం వదిలి పెట్టి, ప్రసాద్, రియాజు సోమవారం మరలా స్టేషన్‌కి వెళ్లారని అన్నారు. 13, 14 తేదీల్లో వాళ్ళు స్టేషన్‌లో లేరని ఎస్పీ చెబుతుంటే, సదరు తేదీల్లో వాళ్లు ఎక్కడున్నారో తెలిపే పూర్తి సిసి టివీ ఫుటేజీలను మీడియా ముందు ఎందుకు పెట్టడం లేదన్నారు. చనిపోవడానికి ముందు ఏడుకొండలు తన సోదరి ధనమ్మ వద్ద ఏడుస్తూ, పోలీసులు తనను విమానం (రెండు చేతులు వెనక్కి కట్టి పైకి లాగడం) అనే థర్డ్ డిగ్రీ ప్రయోగించి విపరీతంగా కొట్టారని, ఆ దెబ్బలు తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. పోస్ట్‌మార్టంకు ముందు బాడీని స్వయంగా పరిశీలించాను, ఏడుకొండల నోటి నుంచి ఎక్కడా నురగ రాలేదు, కానీ ఒంటిపై బురద మరకలు, కాళ్లు మరియు వెనుక భాగంలో తీవ్రమైన దెబ్బలు ఉన్నాయి, కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయింది, ఒక వేలు విరిగిపోయి ఉంది.

**సాక్ష్యాల తారుమారు వెంకటాచలం పోలీస్ స్టేషన్ హైడ్రామా** 14వ తేదీ రాత్రి కానిస్టేబుల్ మాధవ్ అనే వ్యక్తి మరో నిందితుడు రియాజ్‌ను అదుపులోకి తీసుకుని, రహస్యంగా వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో పెట్టి, పోలీసులకు అనుకూలంగా వాంగ్మూలాలు రాయించుకుని సంతకాలు చేయించుకున్నారు. వీటికి బాధ్యుడైన ఎస్ఐ, పోలీసులను కాపాడేందుకు టీడీపీ స్థానిక నాయకుడు సుధీర్, మృతుడి అక్క ధనమ్మతో ఫోన్‌లలో మాట్లాడి, ఆర్థిక సహాయం చేస్తామని, ఎమ్మెల్యే సోమిరెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తామని ప్రలోభపెట్టిన ఆడియో రికార్డు కూడా ఉంది. (ఆడియో మీడియా ముందు వినిపించిన కాకాణి). సాక్ష్యాలను తారుమారు చేయాలని చూస్తున్న సదరు టీడీపీ నేతలపై కూడా కేసు నమోదు చేయాలి. ఏడుకొండల లాకప్ డెత్‌కు కారణమైన పోలీసు అధికారులపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

మిగతా 2 పేజీలో

# మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్



**నెల్లూరు కార్పోరేషన్, జులై 16 ప్రభాతవార్త :** ఏపి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌లు విదవిధ అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ వైఓ.నందన్ అధికారులతో కలసి హాజరయ్యారు. సమావేశంలో ఏపి అర్బన్ డిజిటల్ రిజిస్ట్రీ అసెట్ మాడ్యూల్ అప్లేషన్ రెవెన్యూ వసూళ్ళు మరియు తాగునీటి కుళాయి పన్నువసూళ్ళు స్మార్ట్ ప్రిపెయిడ్ ఎలక్ట్రిసిటి, ట్రాఫిక్ సిగ్నల్స్, వేస్ట్ మేనేజ్‌మెంటు ఎస్‌జిటి మార్గదర్శకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వివిద అంశాల అమలు ప్రక్రియ ప్రణాళికాబద్దంగా నిర్వహించాలని అదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమిషనర్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిడిఎంఎ నిర్దేశించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లాన్ రఘునాథరావు, ఆరోగ్యశాఖ అధికారి డాకటర్ దినేష్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు శేషగిరిరావు, చంద్రయ్య, అనిల్‌కుమార్ టిపిఆర్ఓ వాసుబాబు, ఏసిపి వేణు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు హాజరయ్యారు.

## మాజీ జెడ్పిటిసి శేఖరయ్య కుటుంబాన్ని పరామర్శించిన వేమిరెడ్డి



**సంగం జూలై 16 ప్రభాతవార్త** సంగం మండలం జంగాల కండ్రిక గ్రామంలో మాజీ జెడ్పిటిసి గంగపట్నం చంద్రశేఖరయ్యఉత్తర క్రియలలో ఎంపి వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. చంద్రశేఖరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. శేఖరయ్య లేని లోటు తీర్చలేనిదని అన్నారు. చంద్రశేఖరయ్య కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఆయన వెంట నాయకులు రూప్‌కుమార్‌యాదవ్ కూడా ఉన్నారు.

## మాజీ జడ్పిటిసి చంద్రశేఖరయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సంగం జులై 16 ప్రభాతవార్త సంగం మండలం జంగాలకండ్రికలో జెడ్పిటిసి గంగపట్నం చంద్రశేఖరయ్య ఉత్తర క్రియలలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. దివంగత చంద్రశేఖరయ్య చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మా కుటుంబంతో చంద్రశేఖరయ్యకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని మంత్రి గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట కిమ్స్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరక్టర్ తాళూఘ్లరు గిరినాయుడు తదితరులున్నారు.

## జెర్సీలను ఆవిష్కరించిన కావలి బార్ అసోసియేషన్





**కావలి, జులై 16 ప్రభాతవార్త :** కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో నెల్లూరులో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు గురువారం యువ న్యాయవాది గుర్రంకొండ సర్దార్ స్వీయ నిధులతో 30 జెర్సీలను, 4 క్రికెట్ కిట్లులను, టోపీలను, కావలి కేసిసి నెట్‌కు లైట్లు కోసం రూ.10వేలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి చేతుల మీదుగా కేక్‌కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులను దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి రుషికుమార్, ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ సునీల్‌బాబు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సీల్ టెండర్లు నిర్వహణ



**గూడూరు, జూలై 16, ప్రభాతవార్త** ఆగస్టు 15, 16, 17 తేదీల్లో గూడూరు పట్టణంలోని ధర్మరాజుల స్వామి దేవస్థానంవద్ద ఉన్నగాలి గోపురం పై కలిశాల ప్రతిష్ట కుంభాభిషేకంకోసం సీల్ టెండర్లు నిర్వహించడం జరిగింది. మూడు రోజులు కోసం పుష్పాలు, పూలమాలలు, విద్యుత్ దీపాల అలంకరణ, సౌండ్ సిస్టం అండ్ హైరస్, చలువ పందెంలో వైట్ వాష్, రంగులు ప్రింటింగ్ వాల్ పోస్టర్ ఆహ్వాన పత్రికలు, ఫ్లెక్సీ ప్రింటింగ్ యాగ్నిక స్వాములు, పలసరుకులు, అన్నదానం, గోపురంకి, సెంట్రింగ్ ఏర్పాటు కొరకు సీల్ టెండర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వాటం బేడు శివ కుమార్, ఈవో రవి కృష్ణ ఇన్స్పెక్టర్ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల భీమా పథకాలతో రైతులకు భరోసా



**నెల్లూరు అగ్రికల్చర్, జూలై 16, ప్రభాతవార్త** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం ద్వారా తమ పంటలను భీమా చేయించుకొని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి తెలిపారు. గురువారం నెల్లూరులోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం కృషి సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు నిర్ణీత గడువులోగా పంటల భీమా ప్రీమియం చెల్లించి, పంట నష్టం సంభవించినప్పుడు నష్టపరిహారం పొందేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**– వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం..** వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం ద్వారా ప్రతి పంటకు భీమా సౌకర్యం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలిపారు. జూలై 24 వరకు ప్రీమియం చెల్లించే గడువు ఉందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (దిగుబడి ఆధారిత పంటల భీమా) పంట రుణాలు పొందిన రైతులు తప్పనిసరిగా సంబంధిత బ్యాంకులో పంట భీమా ప్రీమియం చెల్లించే విధంగా లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి ప్రీమియం చెల్లించాలన్నారు. వేరుశెనగ పంటకు ప్రీమియం చెల్లించే గడువు జూలై 31 వరకు ఉంటుందన్నారు. ఆగస్టు 15 వరకు వరి పంటకు ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

**– రైతులు చెల్లించాల్సిన ప్రీమియం..** వేరుశెనగ పంటకు ఎకరానికి రూ. 280 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అలాగే వరి పంటకు ఎకరానికి 840 రూపాయలు చెల్లించాలన్నారు.

**– పంట నష్టం సంభవించినప్పుడు లభించే పరిహారం..** వేరుశెనగ పంటకు ఎకరానికి రూ. 28,000, వరి పంటకు ఎకరానికి రూ. 42,000 వరకు పొందవచ్చు అన్నారు. ఈ పథకానికి సంబంధించిన ప్రీమియంను టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి చెల్లించాలని సూచించారు. అలాగే పత్తి పంటకు ఎకరానికి రూ. 2,000 చెల్లిస్తే ఎకరానికి రూ. 40,000 వరకు పరిహారం లభిస్తుందన్నారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్, పోస్టాఫీసులలో సంప్రదించి నిర్ణీత గడువులోగా పంటల బీమా ప్రీమియం చెల్లించి పథకాల ప్రయోజనాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి కోరారు.

## స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యల సాధనకు మాస్టర్ లెవల్ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ విజయవంతం



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – అగ్రికల్చర్** స్వర్ణాంధ 2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులకు గ్రాస్ వాల్యూ యాడెడ్‌కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ అంశాలపై మాస్టర్ లెవల్ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం గురువారం నెల్లూరులోని కృషి సమావేశ మందిరం, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డి. సుజాత అధ్యక్షత వహించగా, గణాంక శాఖ అధికారి శ్యామ్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయ సహాయ సంచాలకులు డి. సుజాత మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో వ్యవసాయ శాఖ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయిలో నాణ్యమైన గణాంకాల సేకరణ, విలువ ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, సమీకృత వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయడం ద్వారా జిల్లా అభివృద్ధికి అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

## అన్నారెడ్డిపాళెంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు



**సంగం జులై 16 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డి పాళెం గ్రామంలో పంచాయితీ సెక్రటరీ మల్లికార్జున, మెడికల్ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో బ్లీచింగ్ చల్లించారు. ఇండ్లలో దోమల మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా పంచాయితీ సెక్రటరీ మాట్లాడుతు గ్రామంలో ఎటువంటి అంటు వ్యాధులు ప్రబల కుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గోన్నారు.

# ఏడుకొండలది ముమ్మాటికీ సర్కార్ హత్యే కాకాణి

మొదటి పేజీల తరువాయి

**మృతుడి కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

**కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలి**

**బుచ్చిరెడ్డిపాలెంలో దారుణం**

**సీఐ లంచాల దాహానికి ఒకే కుటుంబం బలి**

మరోవైపు జూన్ 15న బుచ్చిరెడ్డిపాలెంలో అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీహరి అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యాడు. ఒంటి నిండా గాయాలున్నాయి. అయితే అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) శ్రీనివాసరావు రూ. 40 లక్షల డీల్ మాట్లాడుకుని, పోస్ట్‌మార్టం కూడా చేయకుండా కేసును గుండెపోటుగా చిత్రీకరించి మూసేశారు. అంటే వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్తాడా? హోంమంత్రి చెబుతుందా? డీజీపీ చెబుతారా? తన భర్త మరణంపై అనుమా నం వచ్చి, తన అన్న చంపేశాడని శ్రీహరి భార్య జూన్ 15 న పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఐ దాన్ని కనీసం తీసుకోలేదు. దీంతో గత్యంతరం లేక జిల్లా ఎస్పీని ఆశ్రయించిన తర్వాత దానిపై విచారణకు ఆదేశిస్తే జూలై 9న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే సామూహిక ఆత్మహత్య జరిగింది. వాస్తవానికి శ్రీహరి భార్య ఎస్పీ గారికి ఫిర్యాదు చేసిన అనంతరం, హత్య జరిగిన 25 రోజుల తర్వాత గానీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఈ లోగా నిందితుడు తాను తప్పు చేయలేదని, అవమానాలు భరించలేక చనిపోతున్నానని వీడియో విడుదల చేసినా పోలీసులు నిఘా పెట్టలేదు. ఫలితంగా మనస్తాపానికి గురైన ఆ కుటుంబం మొత్తం (హరికృష్ణ, భార్య ప్రణీత, పిల్లలు కౌశిక్, మోహాఅంబిక) సింగరాయకొండ దగ్గర రైలు కింద పడి సామూహిక ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత దౌర్భాగ్యం. సదరు అవినీతి అధికారి వల్ల ఒక కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది, మరో కుటుంబం పూర్తిగా లేకుండా పోయింది.

**పోస్టింగుల కోసం లక్షల్లో లంచాలు రాష్ట్రంలో నడుస్తోంది రెడ్ బుక్ రాజ్యాంగం**

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా పట్టాలు తప్పింది. జిల్లాకు వచ్చే సిఐలు తాము లక్షల రూపాయలు ఇచ్చి పోస్టింగులు తెచ్చుకున్నామని, స్టేషన్‌కు వచ్చిన రోజు నుంచే వసూళ్లు ప్రారంభించకపోతే డబ్బులు ఎలా సర్దుతామని బహిరంగంగా మాట్లాడుకుంటున్నారన్నారు. పోలీస్ స్టేషన్లు ఈరోజు ప్రజలకు రక్షణ కల్పించే స్థానాలు కావు, అవి మృత్యు గుహలుగా మారాయి. డబ్బులు మాత్రమే కాకుండా ఒంటి మీద నగలు కాజేసే స్థాయికి, మహిళలపై అరాచకాలకు పాల్పడే స్థాయికి వ్యవస్థ దిగజారిపోయింది.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగం వల్లే తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కాపాడేవారు ఉన్నారనే ధీమాతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా జిల్లా ఎస్పీ, ఉన్నతాధికారుల, ప్రభుత్వం ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం తప్పనిసరి: బి. సురేంద్ర రాజు




**వింజమూరు, జూలై 16, ప్రభాతవార్త** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాఠ శాల ఉపాధ్యాయులతో పాటు తల్లి దండ్రుల పాత్ర కూడా కీలకంఅని బి. సురేంద్ర రాజు అన్నారు. గురువారం వింజమూరులోని బిఎస్ఆర్ నెక్స్ట్‌జెన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, నవోదయ సైనిక అకాడమీ ఆధ్వర్యంలో తల్లిదం డ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు పా ఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, మానసిక వికాసం కోసం ఆటపాటల ద్వారా శిక్షణ ఇస్తున్నారని తెలి పారు. అదేవిధంగా ఇంటి వద్ద పాఠశాల ఇచ్చిన హోంవర్క్‌ను సక్రమంగా చేయించడం, పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టడం తల్లిదండ్రుల బాధ్యత అని సూచించారు. పిల్లలు ఎలా చదువుతున్నారు. వారి ప్రవర్తన ఎలా ఉంది అని తల్లిదండ్రులుఎప్పటికప్పుడు ఆరా తీయాలి. అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందిఅని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలోనే విద్యార్థి తన భవిష్యత్తును రూపొందించుకుంటాడని, అందువల్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. రోజురోజుకు మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ తరగతులు, డిజిటల్ ప్రయోగశాల ద్వారా సాంకేతిక జ్ఞానాన్ని అందిస్తున్నామని తెలి పారు. కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా పరిసర విజ్ఞానం, సామాజిక జ్ఞానంకూడా అలవడేలా పాఠ శాల కృషిచేస్తుందన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డను సత్ పౌరునిగా తీర్చిదిద్ది సమాజంలో మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అకాడమీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించిన లోక్ అదాలత్ జడ్జి పద్మశ్రీ



**సంగం జులై 16 ప్రభాతవార్త** సంగంలోని స్దానిక బాలికల గురుకుల పాఠశాలను జిల్లా లోక్ అదాలత్ జడ్జి పద్మశ్రీ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థి నులకు కల్పిస్తున్న వసతులు, విద్యాబోదన పరిస్దితులను జడ్మి పద్మశ్రీ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆమె చట్టాలపైన విద్యార్ది ను లకు కల్పించారు. బాలికల రక్షణకు సంబందించిన చట్టాలు, మహిళల హక్కులగురించి ఆమె వివరించారు.

## నేడు ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ - కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌ను నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధిపతులు తమ శాఖలలోని ఉద్యోగులు మరియు ఉద్యోగ సం ఘాలకు ఈ విషయాన్ని తెలియజేసి, ఉద్యోగులు తమ వినతు లు/ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సమక్షంలో సమర్పించు కు నేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. అలాగే, గతంలో స్వీకరించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికలతో ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పట్టాభూమిలో బోర్డు పెట్టిన తహసిల్దార్




**- కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్**

**- హైకోర్టు ఆదేశాలు పట్టించుకోవడంలేదు**

**- వేలంలో కొన్న పట్టాభూమిలో బోర్డు పెట్టిన తహసిల్దార్**

**- మూడేళ్లుగా ఇబ్బంది పెడుతున్న రెవెన్యూ అధికారులు**

**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నామన్న దేవిరెడ్డి హైమావతి జిల్లా యంత్రాంగం ఇకనైనా స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరుకున్నారు. సాక్షాత్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నియమించిన అఫీషియల్ లిక్విడేటర్ సమక్షంలో నిర్వహించిన వేలంలో భూమి కొనుగోలు చేసిన ఆ కుటుంబం కొంతమంది స్థానికులు.. మండల.. డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల నిర్వాకం కారణంగా నానా ఇబ్బందులు పడుతోంది. డైక్లాట్‌లో పట్టా భూమిగా ఉన్న భూమిని ఊట చెరువుకు చెందిన భూమిగా గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చెబుతుండడం.. మండల రెవెన్యూ అధికారులు సైతం ఆ భూమిలో ఎవరూ ప్రవేశించవద్దంటూ అక్కడ బోర్డు పెట్టడంతో సదరు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తోంది. వేలంలో భూమి కొని పాస్ పుస్తకాలు తదితరాలు అన్ని ఉండి కూడా పంటలు సాగు చేసుకోలేక అవస్థలు పడుతోంది. వివరాల్లోకి వెళితే కలువాయికి చెందిన దేవిరెడ్డి హైమవతి 2007లో అనంతసాగరం మండలం ముత్తుకూరులోని 1069 సర్వే నంబర్ లోని 6.97 ఎకరాల భూమిని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నియమించిన అఫీషియల్ లిక్విడేటర్ సమక్షంలో జరిగిన వేలంలో కొనుగోలు చేశారు. 2023 వరకు వరుసగా జామాయిల్ సాగు చేసుకున్న దేవిరెడ్డి హైమావతి అప్పటినుండీ మూడేళ్లుగా ఇబ్బందులకు గురవుతోంది. వరి సాగు చేసుకునేందుకు భూమిని ప్రయత్నం చేయగా అడ్డుకున్న అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అది ఊటు చెరువు భూమిగా అభ్యంతరం తెలిపారు. దీనిపై ఆ వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అప్పటి ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ అది ఊటచెరువు భూమి కాదని.. పట్టా భూమని స్పష్టంగా హైకోర్టుకు తెలియజేయడం జరిగింది. హైకోర్టుకు వెళ్లిన వారికి ఈ మేరకు తహసిల్దార్ ఎండార్స్మెంట్ ఇవ్వగా వారు సవాల్ చేస్తూ తిరిగి కోర్టును ఆశ్రయించడం జరిగింది. దీనిపై 18.12.24 లోగా కౌంటర్ దాఖలు చేయమని హైకోర్టు రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించగా ఇప్పటివరకు వారు ఆ మేరకు కౌంటర్ దాఖలు చేయకపోవడం గమనార్హం. ముత్తుకూరుకు చెందిన వ్యక్తులు ఆరు సర్వే నెంబర్లపై హైకోర్టుకు వెళ్లగా రెవెన్యూ అధికారులు మిగిలిన ఐదు సర్వే నెంబర్లలోని భూమిని పట్టించుకోకుండా దేవిరెడ్డి హైమావతికి చెందిన భూమిలో ఎవరు ప్రవేశించకూడదంటూ బోర్డు పెట్టడం గమనార్హం. సర్వే ...రీ సర్వే పూర్తయి అన్నీ తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దేవి రెడ్డి హైమావతి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆత్మకూరు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు తమకు రక్షణ కల్పించడంతోపాటు పంట సాగు చేసుకునే పరిస్థితి కల్పించాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ 45 రోజులక్రితం ఆదేశాలు ఇచ్చినా ఆత్మకూరు ఆర్డీవో పట్టించుకోవడం లేదన్నారు. ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించినా స్పందించడం లేదన్నారు. మూడేళ్లుగా అనంతసాగరం తహసిల్దార్ కార్యాలయం చుట్టూ.. ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం చుట్టూ.. తిరిగిన ప్రయోజనం లేదని ఆమె వాపోయారు.

## సిఏ,సిఎంఏ ఫలితాల్లో సత్తా చాటిన జెనెక్స్ విద్యార్థులు

**జాతీయస్థాయిలో 18 ర్యాంకులు కైవశం**




**నెల్లూరు, జులై 16, ప్రభాతవార్త –విద్య** ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన సిఏ,సిఎంఏ ఫలితాల్లో నగరంలోని స్థానిక పార్థసారథి నగర్‌లోని జెనెక్స్‌విజన్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా 18 జాతీయ స్థాయి ర్యాంకులను సాధించి విజయ కేతనం ఎగురవేశారు. ఎన్.అభినయశ్రీ ప్రథమ ర్యాంకు, డి.మహిధర్ ద్వితీయ ర్యాంకు, గీతామాధురి మూడవ ర్యాంకు, బి.రమాసుధ 4, పి.అక్షయ 5, షేక్.సుమయా ఫాతిమా 8, ఎస్ జి.పవిత్ర 10, కే.రమ్య, 11, ఎస్‌కే.రాఫియా 13, ఎస్‌కే.సుహాన్ 14, ఎ.హాసినీ 16, వై.పూజ17, బి.మోహ న్‌చంద్17, ఎస్‌డి. షాధ్ అహ్మద్18, సిహెచ్.స్పందన , బి.సాయి తేజ,ఎల్.లోకేష్‌లు 19వ ర్యాంకు, ఎస్‌కే,ఇలియాజ్ అహ్మద్20 వ ర్యాంకు కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్లు ఎన్.వెంగళరెడ్డి, పి.కొండలరావులు ఈ సం దర్భంగా మాట్లాడుతు తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు కైవశం చేసుకోవటం గర్వకారణ మన్నారు. అలాగే సిఏటి పరీక్షకు హాజరైన విద్యార్థులు అందరూ నూటికి నూరుశాతం ఉతీర్ణత సాధించటం జరిగిందన్నారు. ఉత్తమ పలితాలు సాధించిన వారు భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి, భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలుతెలిపారు. ప్రిన్సిపాల్, అద్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ చట్టాల బిల్లు పై జాయింట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ బీద మస్తాన్ రావు



**కావలి, జూలై16, ప్రభాతవార్త:** పార్లమెంట్ హౌస్ అనెక్సీలో గురువారం జరిగిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు-2026పై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సమావేశంలో రాజ్యసభ సభ్యులు, కమిటీ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారుల నుంచి బిల్లులోని ప్రతి క్లాజుపై సమగ్ర వివరణను కమిటీ సభ్యులు స్వీకరించారు. అనంతరం క్లాజ్ బైక్లాజ్ పరిశీలన కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్ బిల్లులో ప్రతిపాదించిన నిబంధనల అమలు, పారదర్శకత, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ, కార్పొరేట్ పాలన బలోపేతం వంటి అంశాలపై తన అభిప్రాయాలు, సూచనలను కమిటీ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దేశ ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక రంగానికి తోడ్పడే విధంగా చట్టం మరింత సమర్థవంతంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, జాయింట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ హడ్ హాక్ మేనేజింగ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – వైద్యం** రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతస్థాయిలో అమలు చేయాలని అడహాక్ మేనేజింగ్ కమిటీ సభ్యులకు డిఆర్ఓ, రెడ్ క్రాస్ ప్రత్యేక అధికారి ఎన్. విజయకుమార్ సూచించారు. గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖకు నూతనంగా నియమించబడిన అడహాక్ మేనేజింగ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 11 మంది అడహాక్ మేనేజింగ్ కమిటీ సభ్యులు మరియు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిటైర్డ్ డీఈ గోసుల వెంకట సుబ్బారెడ్డి రెడ్ క్రాస్‌లో వైద్యం పొందుతున్న క్యాన్సర్ రోగుల కోసం 2,00,000 (రెండు లక్షల రూపాయలను) విరాళంగా అందజేశారు. ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు మానవతా దృక్పథానికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ఈ సేవలను మరింత విస్తృత స్థాయిలో అమలు చేయాలన్నారు. జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందేలా సమిష్టిగా కృషి చేసి రెడ్ క్రాస్ సేవలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. గోసుల వెంకట సుబ్బారెడ్డి దాతృత్వం స్ఫూర్తిదాయకమని, దాతల సహకారంతోనే రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించగలమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు రెడ్ క్రాస్ ఆశయాలు కనుగుణంగా నిస్వార్థ సేవ భావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రటరీ పి. మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉండే బీడీసీ గ్రంథాలయాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి**



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – వైద్యం** గ్రామాల్లో ఉండే బీడీసీ గ్రం థాలయాలు ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి పేర్కొన్నారు. జిల్లాలోని ఆత్మకూరులో ఉన్నటువంటి సబ్ జైల్, టౌన్ హాల్, వెంకట్రావు పల్లి, ఏ.ఎస్.పేట, బుచ్చి మండలలోని మినగల్లు, మనుబోలుపాడు, నాగ య్యగుంట, ఇస్కపాలెం, కోవూరు మండలంలోని చిన్న పడుగుపాడు, కోవూరు, కొడవలూరు మండలం లో నియల్లాయపాలెం, కొత్తవం గల్లు, విడవలూరు మండలంలోని అలాగానిపాడు, అన్నా రెడ్డిపాలెం, రా మచంద్రపురం, గ్రామాల్లో ఉన్నటువంటి బీడీసీ గ్రంథాలయాలను నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్నటువంటి గ్రంథాలయాలు గ్రామంలోని ప్రజల అక్షరాస్యత, విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయని, రాబోయే రోజుల్లో దాతలసహకారంతో బీడీసీ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని, నెల్లూరు జిల్లాలోబీడీసీ గ్రంథాలయాల ద్వారా వినూత్న రీతిలో రాబోయే రోజుల్లో కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలియజేశారు.

## నారా లోకేష్‌ను కలిసిన ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – వైద్యం** విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఉండవల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత దేశ చరిత్ర లో ఎన్నడూ లేని విధంగా ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాలిం ఏ హునర్ కార్యక్రమానికి సంబంధించిన బుక్లెట్‌ను మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యా ర్థులకు అందిస్తున్న ఉచిత నాణ్యమైన విద్య, శిక్షణ, అలాగే కార్యక్రమం సాధించిన ఫలి తాలను వివరించారు. అదేవిధంగా, చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చేపట్టిన పరిపాలనా సంస్కరణలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఆదాయ వృద్ధి, డిజిటలైజేషన్, పెండింగ్ సమస్యల పరిష్కారం, విద్యా, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర నివేదికను మంత్రి నారా లోకేష్‌కు వివరించారు. ఈ మేరకు వక్ఫ్ బోర్డు చేపడుతున్న సంస్కరణలు, విద్యా రంగంలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను మంత్రి నారా లోకేష్ అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా విద్యార్థులు, సమాజ అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

## సాయినాధుడ్ని దర్శించుకున్న సిఐ శివరామకృష్ణారెడ్డి



**బుచ్చి జులై 16 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని సాయిబాబా గుడిలోని సాయినాధుడ్ని కొత్త గా వచ్చిన సిఐ శివరామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమీటి ఆయనను స్వాగతించి ఆయన పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్బంగా సిఐ ఆలయ పరిసరాల ప్రాంతాన్ని పరిశీలించి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో కమీటి సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ - యువకుడి హత్య



**ఇందుకూరుపేట, జూలై 16, ప్రభాతవార్త :** మద్యం మత్తు, క్షణికావేశం ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పల్లిపాడులో చోటుచేసుకున్న ఈ హింసాత్మక ఘటన తీవ్ర కలకలం రేపింది. స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో మొదలైన ఘర్షణ చివరకు హత్యకు దారితీసింది. పుట్టినరోజు వేడుకల్లో మొదలైన వివాదం పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఎస్.కె. సుల్తాన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అతని స్నేహితులు పల్లిపాడు సవక తోటలో మద్యం విందు ఏర్పాటు చేసుకున్నారు. అందరూ కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో, అక్కడ ఉన్న రాజేంద్ర అనే యువకుడికి, ఎస్.కె. సుల్తాన్‌కు మధ్య అనుకోకుండా స్వల్ప వివాదం తలెత్తింది. మద్యం మత్తులో ఉన్న ఇరువర్గాలు క్షణాల్లో ఊగిపోయాయి. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన రాజేంద్ర అక్కడే ఉన్న ఒక బీరు సీసాను తీసుకొని సుల్తాన్ తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన సుల్తాన్, తన చేతికి ఉన్న కడియంతో రాజేంద్రపై ఎదురుదాడికి దిగాడు. ఈ గొడవ తీవ్రరూపం దాల్చడంతో అక్కడే ఉన్న వారి స్నేహితులు, రాజేంద్ర సోదరుడైన రాజశేఖర్ రంగంలోకి దిగారు. పరిస్థితిని అదుపు చేయాల్సింది పోయి, రాజశేఖర్ పక్కనే ఉన్న ఆటోలో దాచి ఉంచిన ఓ పదునైన ఆయుధాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఏమాత్రం ఆలోచించకుండా ఆ ఆయుధంతో సుల్తాన్ తలపై బలంగా బాదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో సుల్తాన్ కోమాలోకి పోయి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సుల్తాన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. సుల్తాన్ తండ్రి అనారోగ్య కారణాలతో మంచంలోని జీవనం సాగిస్తున్నాడు. తల్లి కూలి నాళిచేసుకొని భర్త కొడుకులను పోషిస్తుంది. సమాచారం అందుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తన సిబ్బందితో కలిసి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ప్రశాంతంగా ఉండే పల్లెపాడులో ఇలాంటి అమానుష ఘటన జరగడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

## ముత్తుకూరు ఎంపిడిఓగా హేమంత్



**ముత్తుకూరు, జూలై 16, ప్రభాతవార్త :** ముత్తుకూరు ఎంపిడిఓగా హేమంత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతి బదిలీలలో భాగంగా ముత్తుకూరు మండలం నుంచి కందుకూరు డిడిఓగా నాగమణి బదిలీ అయ్యారు. ముత్తుకూరు మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఓ కొనసాగుతున్న హేమంత్ ఎంపిడిఓ (ఎఫ్ఏసి)గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓ హేమంత్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరులోని 33/11కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్‌లోని 11కేవీ డిఎస్ నగర్, 11కేవీ డిఎస్ నగర్ ఇండస్ట్రియల్ ఫీడర్స్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురా నగర్, ప్రశాంతి నగర్, 3వ మైల్, రాజీవ్ గాంధీ కాలనీ, వెంగల్ రెడ్డి నగర్, సాధవారిపాలెం పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేసారు.

## సజ్జాదా నషీన్‌గా కొనసాగింపుపై వక్ఫ్‌బోర్డు సమాధానం చెప్పాలి

**- జనసేన నాయకుడు అక్బర్‌బాషా**





**అనుమన ముద్రంపేట, జులై 16, ప్రభాతవార్త :**ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా వ్యవహారంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ద్వంద్వ వైఖలి అవలంభిస్తోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని జనసేన మండల నాయకుడు సయ్యద్ అక్బర్‌బాషా ఆరోపించారు. గురు వారం స్థానిక విలేకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారికంగా రెండు సార్లు స్పందిస్తూ మహిళలు, చిన్నారులపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులుఎదుర్కొంటున్న వ్యక్తులు మత సంస్థల్లో ఆధ్యాత్మిక బాధ్యతల్లో కొనసాగకూడదని స్పష్టం చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు వక్ఫ్‌బోర్డు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకొనకపోవడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాఫీజ్‌బాషాను ముతవల్లి పదవి నుంచి తొలగించిన వక్ఫ్‌బోర్డు అదే వ్యక్తిని సజ్జాదానషీన్‌గా కొనసాగించడం ఎలా సమంజసమవుతుందని ప్రశ్నించారు.ఒక వ్యక్తి ముతవల్లిగా కొనసాగడానికిఅనర్హుడని భావిస్తే అదే వ్యక్తి దర్గా ఆధ్యాత్మిక పీఠాధిపతిగా ఎలా కొనసాగుతున్నారో ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. కొంతమంది మహిళలు చేసిన ఆరోపణలపై కేసులు విచారణలో ఉన్న నేపథ్యంలో దర్గా పవిత్రత, భక్తుల విశ్వాసం, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని వక్ఫ్‌బోర్డు అత్యంత బాధ్యతతో పరిశీలించాల్సిన అవసరంఉందన్నారు. ముతవల్లి పదవి విషయంలో ఒక విధానం సజ్జాదానషీన్ పదవి విషయంలో మరో విధానం ఎందుకు అమలు చేస్తున్నారో వక్ఫ్‌బోర్డు ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో నెలకొనన అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని కోరారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ సూచనలు, హైకోర్టు పరిణామాలు, ప్రజల విజ్ఞప్తులను కూడా పట్టించుకొనకుండా వక్ఫ్‌బోర్డు మౌనం కొనసాగిస్తే, ప్రజాస్వామ్యబద్ధంగా జనసేన పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అవసరమైతే దర్గా పరిరక్షణ కోసం ధర్నాలు,నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, మత సంస్థల పవిత్రతను కాపాడడం భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టడం వక్ఫ్‌బోర్డు బాధ్యత అని పేర్కొన్నారు. భక్తులు, స్థానికుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని వక్ఫ్‌బోర్డు త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని ఈసందర్బంగా ఆయన డిమాండ్ చేశారు.

## ఈనెల 22 న తల్లికి వందనం

**కోట,జులై 16 ప్రభాతవార్త :** విద్యార్దులు, తల్లిదండ్రులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల 22 న తల్లికి వందనం నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్దులకు ఈపధకం వర్తించనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుల్లో చదువుతున్న ప్రతి చిన్నారికి ఈపధకం ద్వారా ఏటా రూ 15 వేలు చొప్పన ఆర్థిక సాయం అందిస్తోంది. తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ 13 వేలు, పాఠశా నిర్వహణకు రూ 2 వేలు ఖర్చు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే పాఠశాల,కళాశాలల్లో చదువుతున్న విద్యార్దుల తల్లుల ఖాతాలను ప్రభుత్వం వెరిఫై చేసింది. అర్హులైన జాబితాను 22నే స్వర్ణ సచివాలయాల్లో ప్రకటించి అదే రోజు వారి ఖాతాలకు నగదు జమ చేయనుంది.కోట మండలంలో ప్రభుత్వ ప్రవేటు స్కూల్ విద్యార్దులు 10,600 మంది తల్లికి వందనంకు అర్హులని ఎంఇఓ 1 మస్తానయ్య తెలిపారు.

## మండుటెండల్లో మంచు'బిందు'వులు



**కోట, జూలై 16 ప్రభాతవార్త :** ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా వరుణుడు మాత్రం కనికరించడం లేదు. ఆకాశం నుంచి చినుకు జాడ కానరావడం లేదు. తొలకరి జల్లు పడితే వ్యవసాయ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభించడానికి రైతన్నలు సిద్ధమవుతుంటే వాన రానంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు రైతులు సూక్ష్మసేద్యంలో పంటలకు నీటి తడులు అందిస్తూ కాపాడుకుంటున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన వర్షాలు లేక జిల్లాలో ఇప్పటికే కొందరు రైతులు బిందు, తుంపర సేద్యం వైపు మొగ్గు చూపుతు న్నారు. పరిమిత జల వనరులతోనే..బోర్లలో పరిమితంగా ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగిం చుకునేందుకు రైతులు డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు స్ప్రింకర్ల విధానాన్ని ఆశ్రయిస్తున్నారు. దీనిద్వారా ప్రతి మొక్కకు సమానంగా తేమ అందడంతో పాటు తక్కువ సమయంలోనే మొత్తం పొలానికి నీరందించే అవకాశం కలుగుతుందని రైతులు చెప్తున్నారు. కోట మండలంలోని కర్లపూడి, సిద్ధవరం, సిద్ధవరం నుంచి కనుపూరుకి వెళ్లే మార్గంలో రైతులు తుంపర సేద్యాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నారు. ప్రస్తుతం నీటి కొరత పరిస్థితుల్లో ఈ పద్ధతి పంటలను బతికించే మార్గంగా కనిపిస్తోందని రైతులు చెప్తున్నారు. సూక్ష్మ సేద్యం పరికరాలను ప్రభుత్వం భారీ రాయితీలతో అందిస్తుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

## పెద్దగోవిందపల్లి హైస్కూల్‌లో తనిఖీలు



**కోట, జూలై 16 ప్రభాతవార్త :** కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని పెద్దగోవిందపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి దారా మస్తానయ్య తనిఖీ చేశారు. హైస్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం హైస్కూల్లో రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు చేసుకోండి

**కోట, జూలై 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులందరూ ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంఇఒ-1 దారా మస్తానయ్య కోరారు. ఇందుకోసం ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కనీసం పదేళ్ల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులంతా నిబంధనల ప్రకారం స్వయంగా లేదా ఐదుగురు తోటి ఉపాధ్యాయుల సిఫార్సుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ వ్యతిరేక కార్యక్రమంలో పాల్గొనండి

**బిట్రగుంట జూలై 16 ప్రభాతవార్త :** రామాయపట్నం పోర్ట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు కావలి నియోజకవర్గం లో మాజీ శాసనసభ్యులు కావలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 18వ తారీకు అనగా శనివారం చలో రామాయపట్నం కార్యక్రమం నిర్వహించబడుతుందని మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు అందరూ కూడా 18 వ తారీకు ఉదయం 8 గంటలకు ముసునూరులోని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకొని అక్కడ నుండి బైక్ ర్యాలీతో రామాయపట్నం పోర్ట్ వద్దకు వెళ్లి నిరసన తెలుపవలసి ఉన్నది కావున రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పై కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ విద్యార్థులు బీటెక్ అనంతరం పోటీ పరీక్షలకు ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయాలు మీ చెంత వస్తాయని ఏసీఈ ఇంజనీరింగ్ అకాడమీకి చెందిన అకడమిక్ మెంటర్ కౌశిక్ అగస్త్యరాజ్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ అనంతరం కెరీర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులు గేట్, ప్రభుత్వ రంగ స్థలాల్లో ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయాలు మీ వెంట వస్తాయన్నారు. ఈ పోటీ పరీక్షలకు సమర్థవంతంగా ముందుకు సాగి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించేందుకు అవసరమైన ప్రణాళికలపై అవగాహన చేసుకోవాలన్నారు. డీన్ డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ నిరంతర సాధన, సరైన మార్గదర్శకత్వం విజయానికి కీలకమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి మంచి అవకాశాలను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, మూడవ సంవత్సరం బీటెక్ విద్యార్థులు ఉన్నారు.

## రైతు మిత్ర గ్రూపులు మరింత బలోపేతం కావాలి



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** కోవూరు మండలానికి సంబంధించి మహిళా రైతు గ్రూపులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలోకి రావాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో గురువారం వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రైతు గ్రూపులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ గ్రూపు సభ్యులు ప్రస్తుతం సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంట దిగుబడిని పెంచేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా సాగు ఖర్చు తగ్గించి దిగుబడి పెంచేలా మహిళా రైతు గ్రూపులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజయవాడ సెర్ప్ నుంచి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాము, మురళి, శోభ, తదితరులు ఉన్నారు.

## నేడు ఎమ్మెల్యేచే అభివృద్ధి పనులకు శ్రీకారం



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రారంభిస్తారని మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ప్రారంభం అనంతరం ఈ గ్రామంలోని రైతులకు ప్రభుత్వం ద్వారా నూతనంగా వచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా పూజలు





కోవూరు, జూలై 16ప్రభాతవార్త : కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసరరాజు హిమవతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా పచ్చిపాల రాజా విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు శేఖర్ స్వామి, భక్తులు ఉన్నారు.

## వైభవంగా బాబా పల్లకి సేవ

**వెంకటాచలం జులై 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోనే చెముడు గుంట వద్ద ఉన్న నక్కల కాలనీ సమీపంలోనే శంకర బాబా సన్నిధిలో పల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా బాబాను పూలతో అలంకరించి పల్లకే సేవపై ఆసీనులు చేశారు. బాబా గుడిసెట్టు పల్లకి మోస్తూ సాయినామస్మరణతో మారు మోగింది. పల్లకిలో బాబాని నిద్రంపజేశారు. శంకర్ బాబా ఫౌండేషన్ విద్యార్థులకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు ఈ పల్లకి సేవకు కోమిట్ల అధినేత సత్యనారాయణ రెడ్డి, సతీమణి, నిర్మలాదేవి, పాల్గొన్నారు.

## బీఎల్‌వోలకు శుభవార్త

**రూ 6వేల చొప్పున ప్రోత్సాహకం**

**కోట,జులై 16 ప్రభాతవార్త :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విధుల్లో పాల్గొంటున్న బూత్ లెవల్ అధికారుల (బిఎల్‌వో)కు ఎన్నికల సంఘం శుభవార్త చెప్పింది. సర్ విధుల్లో పాల్గొంటున్న బీఎల్‌వోలకు రూ 6వేలు చొప్పున ప్రోత్సాహకం మంజారు చేస్తూ సీఈవో వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.కోట మండలంలో 52 మంది బిఎల్‌వోలు పనిచేస్తున్నారు.ప్రతి 10 మంది బీఎల్‌వోలకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. వారికి కూడా రూ 6 వేలు చొప్పున మంజారు చేశారు. ఓటర్ల జాబితాల రూపకల్పన ,పోలింగ్ కేంద్రాల హేతబద్దీకరణ వంటి విధుల్లో బిఎల్‌వోలు,సూపర్‌వైజర్లు ఏడాదంతా పాల్గొంటారు. నెలకు రూ వెయ్యితో పాటు సర్ విధుల్లో పాల్గొన్నందుకు అధనంగా మరో రూ 6 వేలు కలిపి రూ 18 వేలు వార్షిక ప్రోత్సాహకంగా అందజేయున్నారు.

## చంద్రశేఖరయ్య కుటుంబాన్ని పరామర్శించిన సోమిరెడ్డి



**సంగం జులై 16 ప్రభాతవార్త :** సంగం మండలం జంగాల కండ్రికలో మాజీ జడ్‌పిటిసి దివంగతనేత చంద్రశేఖరయ్య ఉత్తర క్రియల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. చంద్రశేఖరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. గంగపట్నం చంద్రశేఖరయ్య కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజా సేవలో శేఖరయ్య చూపిన చొరవ ప్రశంసనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులున్నారు.

## భూ సమస్యలపై ఏడు అర్జీలు



**విడవలూరు, జూలై 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గురువారం మూడో విడత 'వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామసభలో భూ సమస్యలకు సంబంధించిన ఏడు అర్జీలు అందాయి. భూమి విస్తీర్ణ నిర్ధారణ, సర్వే నిర్వహణ, హద్దుల గుర్తింపు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ, గ్రామసభలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులకు వెంటనే పంపించి, నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం 'వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని చేపట్టిందని, అర్జీదారులు అవసరమైన పత్రాలతో వినతులు సమర్పిస్తే త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుస్ సలాం, వీఆర్‌వో దుర్గాప్రసాద్, సర్వేయర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విడవలూరుకు నూతన ఎస్సైగా కళ్యాణ్ సాయి



**విడవలూరు, జూలై 16 ప్రభాతవార్త:** విడవలూరు పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉప్పు కళ్యాణ్ సాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై నరేష్ నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ అటాచ్డ్ ఎస్సైగా బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఎస్సై కళ్యాణ్ సాయి మాట్లాడు తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. చట్టవిరుద్ధ కార్యకలా పాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసు శాఖకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.

## చౌకచర్లలో నేత్రదానం



**విడవలూరు, జూలై 16 ప్రభాతవార్త:**మండలంలోని చౌకచర్ల ఎస్సీ కాలనీకి చెందిన ఎల్లు జయరామయ్య (55) అనారోగ్యంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు చౌకచర్లకు చెందిన మనసేవ సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో ఆయన నేత్రాలను దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఐ టెక్నీషియన్ సునీల్, వైద్య సిబ్బంది నేత్రాలను సేకరించారు. నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి లోపం ఉన్న వారికి వెలుగు ప్రసాదించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.

## అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం

**- రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి 'ఆనం'**



**ఆత్మకూరు,జులై16,ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం మాతా - శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో 24మంది ఐసిడిఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు నియామక ఉత్తర్వులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌బాబు నాయకత్వంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలుచేస్తోందన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి చిన్నారుల్లో చిన్న వయసు నుంచే అభ్యాసనా సామర్థ్యాలు, మేధో వికాసం పెంపొందించేందుకు అవసరమైన విద్యాసామాగ్రిని కూడా ప్రభుత్వం అందజేస్తోందన్నారు.నూతనంగా నియమాకాలు పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి సూచించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత, అనంతసాగరం ప్రాజెక్ట్ అధికారిణి శర్మిష్ట, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జి.కస్తూరి, ఎం.కె.నారాయణమ్మ, శారద, ఐసిడిఎస్ సిబ్బంది రమేష్, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఏఈపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



**కొడవలూరు, జులై 16 ప్రభాతవార్త :** మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి గ్రామానికి చెందిన నాయకుడు మాగుంట సతీష్ కుమార్ రెడ్డి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఏఈ ఉదత సురేష్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ప్రత్యేక అధికారి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అధికారుల వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో ప్రజల దరఖాస్తులు, సమస్యల పరిష్కారంపై సరైన చర్యలు కనిపించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారిని అక్కడికక్కడే పిలిపించి వివరణ కోరారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించడం ఇష్టం లేకపోతే తప్పుకోవాలని, ఆ బాధ్యతలు నిర్వహించేందుకు మరొకరు ఉంటారని గట్టిగా హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారికి ఎమ్మెల్యే ఆదేశించారు

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు విజ్ఞాన్ విద్యార్థిని ఎంపిక

**- 992 మార్కులతో జిల్లా ఫస్ట్ సాధించిన దేవళ్ల నిత్యకృతికకు రాష్ట్ర ప్రభుత్వ గౌరవం**



**పొదలకూరు, జూలై 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డుకు పొదలకూరులోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవళ్ల నిత్యకృతిక ఎంపికైంది. ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించిన ఆమె రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, నెల్లూరు జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం గురువారం వెల్లడించింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎం. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఏ. సుబ్బారావు, అధ్యాపకులు జి.ఎన్. రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్ విద్యార్థినిని అభినందించారు. నిత్యకృతిక సాధించిన విజయం ఆమె కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు వరుసగా లభిస్తున్న రాష్ట్రస్థాయి గుర్తింపులు పొదలకూరు విద్యారంగ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

## రైస్ మిల్లు సమీపంలో రోడ్డు ప్రమాదం

**- యువకుడికి విరిగిన కాలు**



**తోటపల్లి గూడూరు, జూలై 16, ప్రభాతవార్త :** తోటపల్లి గూడూరు మండలంలోని జగనన్న కాలనీ సమీపంలోని రైస్ మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నక్కవారిపాలెం గ్రామానికి చెందిన ఆర్. సిద్దు (20) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఆయన కుడి కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న అత్యవసర వైద్య సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేర్పించారు. ఈ సహాయక చర్యల్లో వాహన చోదకుడు పెంచలయ్య, అత్యవసర వైద్య సిబ్బంది హరికృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం సిద్దు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## 18 న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



**నెల్లూరు, జూలై 16, (ప్రభాతవార్త –విద్య** 18న నగరంలోని స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లాస్థాయి బాడ్మింటన్ పోటీలు,రాష్ట్రస్థాయి పోటీలకి ఎంపికలని నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ గురువారం ఒ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు . ప్రతి ఒక్క క్రీడాకారుడు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో అండర్ 13,17, 19 మెన్ అండ్ ఉ మెన్ క్రీడాకారులందరూ జూలై 17 తేదీన సాయంత్రం ఏడు గంటల లోపల తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరములకు కోచ్ వెంకటేష్ 994492717 ను సంప్రదించాలన్నారు .

## ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రభుత్వమే నడపాలి



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త –విద్య** ఆర్టీసీ సంస్థలో విద్యుత్ బస్సులను నేరుగా ప్రభుత్వమే నడపాలని ఆర్టీసీ జేఏసీనేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు వినతి పత్రాన్ని గురువారం నగరంలోని స్థానిక వైకాపా నగర కార్యాలయంలో వైకాపా నెల్లూరు నగర ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ విద్యుత్ బస్సు నిర్వహణ ను ఆర్టీసీనే నిర్వహించాలన్నారు. ఈ బస్సుల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు ఇవ్వటంతో ఆర్టీసీ సంస్థలోని ఉద్యోగులకు, కార్మికులకు ఉద్యోగ భద్రత వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అలాగే ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణతో ప్రయాణీకుల ఆదికి తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీంతో సంస్థ మనుగడే కష్టమన్నారు. తమ సమస్యలను చట్ట సభలద్వారా ప్రభుత్వానికి చేరవే య్యాని ,పరిష్కారానికి కృషిచేయ్యాలనికోరారు. అనంతరం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీఇచ్చారు. యూనియన్ నేతలు బాబుశామ్యూల్, కృష్ణారావు, మురళీ మోహన్‌రెడ్డి, నారాయణరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.




## క్రీడాస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం మానికల

## రామసుబ్బమ్మ మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు



**కావలి, జూలై 16 ప్రభాతవార్త :** క్రీడాస్ఫూర్తికి పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం వెటర్నర్ రన్నర్, పరుగుల బామ్మ రామసుబ్బమ్మ అని ఆమె మృతి భాదాకరమని ప్రజావైద్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు తెలిపారు. స్థానిక డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రి నందు గురువారం స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్‌కెబాష ఆధ్వర్యంలో రామసబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సంతాపసభలో పలువురు వక్తలు మాట్లాడారు. పట్టణానికి చెందిన మాణికల రామసబ్బమ్మ ఒక నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించి విశ్వోదయ బాలికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసించడం జరిగిందన్నారు. క్రీడలపై ఆసక్తితో పరుగు పందెం, షార్ట్‌పుట్, జావలింగ్, త్రోబాల్ వంటి వాటిపై క్రీడలలో రాణించి అందరి అదరాభిమానాన్ని సంపాదించారన్నారు. అథ్లెటిక్స్‌లో కూడా బంగారు పతకాలు 32, సిల్వర్ 13, కాంస్యం 3, మొత్తం 49 పతకాలను సాధించారని కొనియాడారు. క్రీడామైదానంలో ఆమె చూపిన చొరవ క్రమశిక్షణ అంకితభావం, ఎప్పటికి గుర్తిండి పోతయన్నారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ ఫౌండేషన్ ఎంవి.ప్రసాద్‌రావు, వాయిస్ఆఫ్ ముస్లిం మైనారీట మొఘల్ సలీం బేగ్, అపద్బాంధవ సేవాట్రస్టు దామ మదుసూదన్‌రావు, ప్రగతి ఎడ్యుకేషనల్ సొసైటి రమణయ్య, హ్యాపీ సేవాసంస్థ సయ్యద్ ఘనిబాష, గుడ్‌మెన్ సోమిశెట్టి బ్రహ్మయ్య,సామాజిక సేవకులు ఎం.అజిత్‌బాబు, ఎం.మాలకొండారెడ్డి, ఘంటసాల రామచంద్రయ్య, ప్రభాకర్ ఎం.నాగరాజు, విజయ్ దేవరకొండ, వెంకట్‌సాయి పాల్గొన్నారు.

## ప్రయాణీకుల సంతృప్తి, సురక్షిత ప్రయాణమే లక్ష్యం

### ఆర్టీసి డిఎం డి.ఆదినారాయణ



**కావలి, జూలై 16 ప్రభాతవార్త :** ప్రయాణీకుల సంతృప్తి, సరక్షిత ప్రయాణమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు ఏపిఎస్ ఆర్టీసి కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ పేర్కొన్నారు. ఆర్టీసి అందిస్తున్న సేవలను వివరించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించి బస్సులలో పంపిణీ చేశారు. ప్రయాణీకుల అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక స్త్రీశక్తి పథకం వల్ల బస్టేషన్‌కు వచ్చే ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగి, పరిశుభ్రత,సౌకర్యాల నిర్వహణపై అధిక ఒత్తడి ఏర్పడినప్పటికి, ప్రయాణీకుల సంతృప్తే లక్ష్యంగా ఏపిఎస్ ఆరిటసి అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ప్రయాణీకలు వేచియుండే ప్రాంతంలో సీటింగ్, ప్యాన్లు, లైటింగ్ సురక్షితమైన తాగునీటి కోసం ఆర్ఒప్లాంట్‌తో శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. ప్రయాణీకులు ఫిర్యాదు పుస్తకంలో కాని, క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి కాని ఫిర్యాదు చేయవచ్చునన్నారు. 58సంవత్సరాలుగా సురక్షిత ప్రయాణం అందిస్తున్న ఆర్టీసి సంస్థను ఆదరిస్తున్నందున డిపో మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు.

## అందరి సహకారంతోనే గ్రంథాలయాలు అభివృద్ధి

### - నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి



**నెల్లూరు,జూలై 16,ప్రభాతవార్త–వైద్యం** గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహకారంగా రెండు నెలల ముందు 20వేల రూపాయలు ముత్తుకూరు రిటైర్డ్ లైబ్రేరియన్ సుశీలమ్మ అందజేయడం జరిగింది. ఆ 20 వేల రూపాయలకి గురువారం ఆరు ఫ్యాన్లు కొనుగోలు చేసి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నాలుగు ఫ్యాన్లు, తోటపల్లి గూడూరు, వెంకటాచలం గ్రంథాలయాలకు ఒక్కొక్క ఫ్యాన్లు అందజేయడం అందజేయడం జరిగిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి తెలియజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని వారు తెలియజేశారు. అదేవిధంగా రిటైర్డ్ లైబ్రేషన్ సుశీలమ్మని గ్రంథాల సంస్థ చైర్ పర్సన్ అభినందించారు.

## ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంకు సంబంధించి తన దగ్గరకు వచ్చిన ప్రతి సమస్యకు తగు పరిష్కారం లభించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నిశితంగా పరిశీలించి వారి సమస్యలను ఓపికగా విని సాధ్యమైనంత వరకు తగు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన సమస్యను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారుల దగ్గరకు తీసుకెళ్లి వాటిని సకాలంలో పరిష్కరించేలా తగు చొరవ తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు.

## కోవూరు ఎంపీడీవోగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోగా ఇప్పటి వరకు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శ్రీహరిరెడ్డి డ్వామా డీడీవోగా పదోన్నతి చెందడం విధితమే.. ఈ మేరకు శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా అభినందించారు.

## పాలిటెక్నిక్ కోర్సు బంగారు భవిష్యత్

### ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు






**కోట,జూలై 16 ప్రభాతవార్త** విద్యార్థి దశ నుంచి క్రమ శిక్షణ అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ మంచి మార్గంలో ఏర్పడుతుందని ఎన్ బీకేఆర్ ఐఎస్‌టి ప్రిన్సిపల్,డాక్టర్.ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేర్ ఐఎస్‌టిలో పాలిటెక్నిక్ విద్యార్థుల కు, వారి తల్లిదండ్రులకు ఓరింటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముందుగా సదస్సు ను ప్రిన్సిపల్ శ్రీనివాసులు,జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మూడుసంవత్సరాల కాలాన్ని పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో చదివితే అటువంటి విద్యార్థుల భవిష్యత్ ఉన్నత శిఖరాలకు చేరుకొంటున్నారని పేర్కొన్నారు.ఏరంగంలో నైనా విజయం సాధించాలంటే ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయ న్నారు. ఆనైపుణ్యాలు సొంతం చేసుకోవాలంటే సాంతికేతిక పరిజ్ఞానంతో పోటీ పడాలన్నారు.విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రోగ్రాస్‌ను ఎప్పుటికప్పుడు తెలుసుకొంటూ ఉండాలన్నారు. అనంతరం అడ్మిషన్ ఇన్‌చార్జీ డాక్టర్,చింతా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సు ను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కోర్సు పూర్తి చేస్తే ఆటు ప్రభుత్వ ఇటు ప్రవేటు రంగంలో ఉద్యోగాలు పొంద వచ్చున్నారు. కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు ను ప్రవేశ పెట్టనందుకు ముందు కరస్పాండెట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతులు తెలిపారు.ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.ఎన్.కిషాందర్ మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌ల్లో చదివే విద్యార్థులకు పరిశ్రమల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ క్యాక్రమంలోఅన్ని విబాగాధిపతులు,యూవీహెచ్ కోఆర్డినేటర్ బి.రాఘవమ్మ పాల్గొన్నారు.

## అరుదైన స్టిల్స్ డిసీజ్‌ను గుర్తించి చికిత్స అందించిన

## మెడికవర్ వైద్యులు డాక్టర్ పెంచల ప్రసాద్

### - అభినందించిన వైద్యులు



**నెల్లూరు, జూలై 15, ప్రభాతవార్త – వైద్యం** అత్యంత అరుదుగా కనిపించే అడల్ట్ ఆన్‌సెట్ స్టిల్స్ డిసీజ్ తరహా తీవ్రమైన హైపర్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధిని మెడికవర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ పెంచల ప్రసాద్ గుర్తించి, సకాలంలో సరైన చికిత్స అందించడం ద్వారా రోగిని విజయవంతంగా కోలుకునేలా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెంచల ప్రసాద్ మాట్లాడుతూ కొద్ది వారాల క్రితం అధిక జ్వరం, చలి, శరీర నొప్పులు, తీవ్రమైన నీరసం, కండరాల నొప్పులు వంటి లక్షణాలతో ఒక మధ్య వయస్సు వ్యక్తి ఆసుపత్రిని ఆశ్రయించారన్నారు. ఈ వ్యాధి ప్రారంభంలో సాధారణ ఇన్ఫెక్షన్‌గా భావించి చికిత్స అందించినప్పటికీ, జ్వరం పూర్తిగా తగ్గకుండా మళ్లీ మళ్లీ రావడం వైద్య బృందాన్ని అప్రమత్తం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో తాను రోగి పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించి, సాధారణ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ కాకుండా శరీరంలో అసాధారణ స్థాయిలో వాపు ప్రతిస్పందన జరుగుతోందని గుర్తించామన్నారు. ఈ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా చాలా అరుదుగా కనిపించే అడల్ట్ ఆన్‌సెట్ స్టిల్స్ డిసీజ్‌ను పోలి ఉండే వ్యాధిగా నిర్ధారణకు వచ్చామని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు ప్రత్యేకమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ చికిత్స ప్రారంభించగా, రోగిలో జ్వరం తగ్గి ఆరోగ్యం క్రమంగా మెరుగు పడిందన్నారు.అనంతరం రోగి పూర్తిస్థాయిలో కోలుకుని సాధారణ జీవనశైలికి తిరిగి చేరుకున్నట్లు వైద్యులు తెలిపారు.అయితే తాము సాధారణ జ్వరం అనుకొని నిర్లక్ష్యం చేయడం కొన్నిసార్లు ప్రమాదకరంగా మారవచ్చు అన్నారు. ముఖ్యంగా రెండు నుండి మూడు వారాలకు పైగా జ్వరం కొనసాగితే లేదా పదేపదే తిరిగి వస్తే వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలన్నారు. కొన్ని అరుదైన ఇమ్యూన్ సంబంధిత వ్యాధులు సాధారణ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ప్రారంభమవుతాయన్నారు. సకాలంలో సరైన నిర్ధారణ, తగిన చికిత్స అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అడల్ట్ ఆన్‌సెట్ స్టిల్స్ డిసీజ్ అనేది పెద్దవారిలో చాలా అరుదుగా కనిపించే ఒక ఆటో ఇన్‌ఫ్లమేటరీ వ్యాధి అన్నారు. ఇందులో అధిక జ్వరం, కీళ్ల నొప్పులు, ఒంటిపై దద్దుర్లు, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపించవచ్చని, సరైన సమయంలో గుర్తించకపోతే శరీరంలోని అనేక అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల అనుభవం, సమగ్ర వైద్య విధానాల ద్వారా ఇలాంటి క్లిష్టమైన, అరుదైన వ్యాధులకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ విజయవంతమైన నిర్ధారణ ద్వారా క్లిష్టమైన వైద్య సమస్యలను కూడా శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, సరైన సమయంలో సరైన చికిత్స అందించడంలో డాక్టర్ పెంచల ప్రసాద్ నైపుణ్యం మరోసారి నిరూపితమైందని సహచర వైద్యులు అభినందించారు.

## వీపీఆర్ నేత్ర మహత్తర కార్యక్రమం



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :**వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నూతనంగా అమలు చేసి వీపీఆర్ నేత్ర కార్యక్రమం ప్రతి ఒక్కరికీ ఉపయోగకరమని పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి తెలిపారు. కోవూరులోని రాళ్లమిట్ట ప్రాంతంలో గురువారం వీపీఆర్ నేత్ర కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న వీపీఆర్ నేత్రను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని ప్రవేశపెట్టిన వీపీఆర్ దంపతులకు కోవూరు ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నామన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరిని ఓపిక పరీక్షించి వారికి అవసరమైన కంటి అద్దాలను కూడా పంపిణీ చేయడం పట్ల ప్రజల్లో మంచి స్పందన కానవస్తోంది.



గురువారం శిబిరానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిరెడ్డి, విజయ కుమార్, సాధిక్, మదన్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.




## నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ. 60 కోట్లతో 97 పనులు

### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడి



**నెల్లూరు, జూలై 16, ప్రభాతవార్త – వైద్యం:** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 60 కోట్ల రూ పాయలతో 97 పనులు చేస్తున్నామని, 48 కిలో మీటర్ల పొడువునా డ్రైన్ నిర్మాణ పనులు చేయి స్తున్నామని, ఎన్నికలు లేనివేళ పార్టీలకు అతీతంగా నెల్లూరు రూరల్ నియో జక వర్గాన్ని అభివృద్ధి చేస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్ల డించారు. గురువారం ఆయన నెల్లూరు రూర ల్ నియోజకవర్గ పరిధిలోని 1వ డివిజన్, కోడూరుపాడు కల్తీ కాలనీలో 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పొదలకూరు రోడ్డు గాంధీనగర్ రోడ్డు తరహాలో కొత్త కాలువ సెంటర్‌లో త్వరలో సెంట్రల్ లైటింగ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతా మ న్నారు. ఈ వయసులో కూడా రాష్ట్రం కోసం ఇంత కష్టం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాక్షించ్చారు. అలాగే నెల్లూరు రూరల్ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువనేత నారా లోకేష్‌కి, మంత్రులు నారాయణకి, ఆనం రామనారాయణ రెడ్డికి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కుడుముల చిరంజీవి, కో క్లస్టర్ ఇంచార్జ్ తమ్మి శ్రీనివాసులు, కోడూరుపాడు పిఏసిఎస్ చైర్మన్ గంగి జయరామి రెడ్డి, 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు జావీద్, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మెన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, టీడీపీ నాయకులు యనమల శ్రీహరి యాదవ్, యనమల శేషు యాదవ్, తమ్మి శ్రీనివాసులు, దొంతు విజయ్ కుమార్, మోలాలి తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావమే పదోన్నతికి మూలం



**కోవూరు, జూలై 16 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అంకితభావం చూపుతూ పై అధికారుల మన్ననలు పొంది పథకాల అమలులో ప్రత్యేకత చూ పడమే పదోన్నతికి మూలమని కోవూరు తహసీల్దార్‌సీ హెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని మండలపరిషత్ సమావేశ మందిరంలో గురువారం కోవూరు ఎంపీడీవోగా పనిచేస్తూ డ్వామా డీడీవోగా పదోన్నతి పొందిన సీహెచ్ శ్రీహరిరెడ్డిని వివిధ శాఖల అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, సచి వాలయ ఉద్యోగులు , వివిధ పార్టీల నాయకులు ఘనం గాసత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీ వల ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమం అమలులో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి ఇచ్చిన సహకారం మరువలేనిదన్నారు. ఎంపీపీ టి.పార్వతి మాట్లాడుతూ రెండు పర్యాయాలు మండలంలో ఎంపీడీవోగా పనిచేసి ప్రతి ఒక్కరి మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి శ్రీహరిరెడ్డి అన్నారు. అటువంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. వైస్ ఎంపీపీ నరసిం హులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి చూపిన చొరవ అభినందనీయమన్నారు. రెండు సార్లు ఎంపీడీవోగా పనిచేసి ప్రతిఒక్కరి మన్ననలు పొందారన్నారు. అటువంటి వ్యక్తి బదిలీ అవడం బాధ అయినా పదోన్నతి కాబట్టి తప్పదన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం, పై అధికారులు ఇచ్చిన ఆదేశాల ను తూచాతప్పకుండా అమలు చేయడంలో ఆయన చూపినచొరం అందరికీ ఆదర్శమన్నారు.ఇంకా ఈ కార్య క్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ప్రసంగించారు.



**అందరి సహకారంతోనే..** మండలంలోని సచివాలయం, అన్ని శాఖల అధికారులతో కోవూరు మండలంలోని ప్రతి పథకం అమలులో ముందుగా నిలబెట్టామని, ఇందుకు ప్రతి ఒక్కరి సహకారమే కారణమని ఎంపీడీవో అన్నారు. తాను ఈ మండలంలో రెండు సార్లు పని చేసినా ప్రతి ఒక్కరు తనను ఆప్యాయంగా చూశాం ్నారు. తాను కూడా కార్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా చూశానని, వారందరూ చూపిన ప్రేమ మరువ లేనన్నా రు. అనంతరం ఎంపీ డీవో దంపతులను భారీ పూలమాల, శాలు వాతో సత్కరించారు. కార్యాలయ పర్యవేక్ష కులు ఉషారాణి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీని వాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు బషీర్, మధుసూదన్‌రావు, సురేష్,డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివా సులుడిప్యూటీ ఎంపీ డీవో సురేష పాల్గొ న్నారు.